క్లుప్తంగా

'ప్రజాపోరు'తో ప్రభుత్వాన్ని నిలదీద్దాం



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

రాయదుర్గంటౌన్: ప్రజాపోరుతో ప్రభుత్వాన్ని నిలదీద్దామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున అన్నారు. ఈ మేరకు ప్రజాపోరు పోస్టర్లను గురువారం సీపీఎం నాయకులు విడుదల చేశారు. మల్లికార్జున మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి 14 వరకు జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం ప్రాంతీయ కమిటీ సభ్యులు మధు, తిమ్మరాజు, శివన్న, ఉచ్చప్ప పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



బ్రహ్మసముద్రం పోలీస స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ రవి బాబు

కళ్యాణదుర్గం రూరల్: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు హెచ్చరించారు. గురువారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో పాలవాయి గ్రామస్తులతో సామావేశం నిర్వహించారు. డీఎస్పీ రవిబాబు మాట్లాడుతూ ఇటీవల పాలవాయి గ్రామంలో సెల్‌ఫోన్‌లో గేమ్ ఆడే సమయంలో వన్నూరస్వామి అనే యువకుడిపై అదే గ్రామానికి చెందిన రామాంజనేయులు కత్తితో దాడి చేశాడన్నారు. దీంతో నిందితుడు రామాంజనేయులు ఇంటిపై గ్రామస్తులు తిరిగి దాడి చేశారన్నారు. గ్రామాల్లో ప్రశాంత జీవనం సాగించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు.

పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

బ్రహ్మసముద్రం : స్థానిక పోలీస్ స్టేషన్‌ను కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రత లకు ఎవరైనా విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో మట్కా, పేకాట, సారా నిర్మూలించడానికి చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ నరేంద్ర కుమార్, సిబ్బందికి సూచించారు.

సీఏతో ఉజ్వల భవిష్యత్



సీఏపై అవగాహన కల్పిస్తున్న మాస్టర్ మైండ్స్ డైరెక్టర్ మోహన్

ఉరవకొండ: వాణిజ్య రంగంలో దిగ్గజ కోర్సు అయిన సీఏ (చార్టెడ్ అకౌంటెన్సీ) తో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మాస్టర్ మైండ్స్ డైరెక్టర్ మోహన్ పేర్కొన్నారు. గురువారం ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీఏపై విద్యార్థులకు వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వాణిజ్య విభాగం అధిపతి నీలివెంకటేసులు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సీనియర్ అధ్యాపకులు వెంకటేసులు మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ కోర్సుల్లో కామర్స్ చదివిన వారికి సీఏ కోర్సు చేయడానికి వీలు ఉంటుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సీతారామ్ గుప్తా, రామాంజనేయులు, ప్రభాకర్, నాగేంద్రరెడ్డి పాల్గొన్నారు.

భూమిపూజ



ఐమాస్ లైట్ల ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న ఆలయ ఈఓ రమేష్‌బాబు

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయ ఆవరణలో ఐమాస్ లైట్ల నిర్మాణానికి గురువారం ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు చేతుల మీదుగా భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈఓ మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కింద భాగంలో ఐమాస్ లైట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

మద్యం దుకాణాన్ని తొలగించండి

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్ రోడ్డు వద్ద మద్యం దుకాణాన్ని తొలగించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. గురువారం పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఎక్సైజ్ సీఐ హసీనాబేగంకు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఓటరు నమోదు

కూడేరు: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 9, 10, 23, 24 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహబూబ్ బాషా గురువారం తెలిపారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు పూర్తయ్యే యువతీయువకులు ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చాన్నారు.

రబీపైనే అన్నదాతల ఆశలు



- పెట్టుబడి భారమవుతున్నా సాగు చేసేందుకే మొగ్గు
- జోరందుకున్న నల్లరేగడి భూముల్లో పప్పుశనగ సాగు
- విత్తన పప్పుశనగ సబ్సిడీలో కూటమి ప్రభుత్వం కోత
- వ్యయప్రయాసలతో బయటి మార్కెట్ల నుంచి సేకరణ



బెళుగుప్ప సమీపంలో నల్లరేగడిలో ట్రాక్టర్‌తో పప్పుశనగ సాగు చేస్తున్న రైతు

బెళుగుప్ప: పప్పుశనగ సాగుకు ప్రసిద్ధి అయిన రాయదుర్గం, ఉరవకొండ, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో రైతులు రబీ సాగుపైనే ఆశలు పెట్టుకున్నారు. ఈ ఏడాది అదునుతప్పి వర్షాలు కురిశాయి. దీంతో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల దిగుబడి చేతికందే పరిస్థితిలేదు. కనీసం రైతు భరోసా ఊసే లేదు. ఇది చాలదన్నట్లు విత్తన పప్పుశనగ పంపిణీలో కోత వేసి, కేవలం 25 శాతం సబ్సిడీతో సరిపెడుతున్నారు. ఇన్ని కష్టాలున్నా రబీలో పప్పుశనగ సాగు వైపు రైతులు మొగ్గుచూపుతున్నారు.

ఉరవకొండ, రాయదుర్గం నియోజకవర్గాల్లో నల్లరేగడి భూములు ఎక్కువగా ఉన్న బెళుగుప్ప, కణేకల్లు, బొమ్మనహాళ్, వజ్రకరూరు, విడపనకల్లు, ఉరవకొండ మండలాలతో పాటు కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం మండలాల్లో స్వల్ప విస్తీర్ణంతో కలిపి సుమారు సుమారు 50 వేల హెక్టార్లలో పప్పుశనగ, దనియాలు, ఉలవ, జొన్న, పెసర సాగు చేస్తారు. నీటి వసతి ఉన్న రైతులు వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటలను మరో ఐదు వేల హెక్టార్లలో రబీ సీజన్‌లో సాగు చేస్తున్నారు.

విత్తనరాయితీని తగ్గించిన కూటమి ప్రభుత్వం: విత్తన పంపిణీలో రైతులకు ఇచ్చే రాయితీని 40 శాతం నుంచి 25 శాతంకు కూటమి ప్రభుత్వం తగ్గించడంతో బయటి మార్కెట్‌లో ఉన్న ధరకు ప్రభుత్వం విత్తన పంపిణీ ధరకు పెద్ద తేడా లేకుండా పోయింది. కళ్యాణదుర్గం, ఉరవకొండ, రాయదుర్గం వ్యవసాయ డివిజన్లలో సుమారు రబీ ప్రధాన పంట పప్పుశన మాత్రమే సుమారు 50 వేల క్వింటాళ్ల వరకు విత్తనాలు అవసరమున్నా నేటి వరకూ కేవలం ఆయా డివిజన్లలో కేవలం సుమారు 12,500 క్వింటాళ్ల పప్పుశనగ విత్తనాన్ని అధికార యంత్రాంగం పంపిణీ చేసింది. బోరుబావుల కింద భూములున్న రైతులు రబీలో సాగుకు అవసరమైన సబ్సిడీ వేరుశనగ విత్తనాలకు సైతం ఎదురు చూడాల్సి వస్తోంది.

వైఎస్సార్‌సీపీ హయాంలో రైతన్నలకు దన్ను.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతాంగానికి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలిచింది. ఉచిత పంటల బీమాతో రైతులు సాగు చేసే పంటలకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి, ఈక్రాప్‌తో లబ్ధి చేకూర్చేది. పీఎం కిసాన్– రైతు భరోసాను ఖరీఫ్, రబీ పంటల సాగు కాలానికి అనువుగా విడుదల చేసి, రైతుల ఖాతాలకు నేరుగా జమ చేసేది. మార్కెట్లో పప్పుశనగ క్వింటా రూ.8,100తో కొనుగోలు చేసి, 40 శాతం రాయితీతో రూ.3,240 పోనూ రైతులకు క్వింటా రూ.4,680 చొప్పున కట్టించుకుని పంపిణీ చేశారు. విత్తనాల సబ్సిడీని ప్రస్తుత కూటమి ప్రభుత్వం తగ్గించడంతో రైతులకు భారం పడింది.

నియోజకవర్గం పేరు	రబీ పంటల సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
ఉరవకొండ	42,500
రాయదుర్గం	16,500
కళ్యాణదుర్గం	15,410

రైతాంగానికి వైఎస్సార్‌సీపీ దన్నుగా నిలిచింది..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతాంగానికి ఉచిత పంటల బీమాతో ప్రభుత్వమే పంటలకు తగిన ప్రీమియం చెల్లించడంతో పాటు రైతు భరోసాతో పంటల సాగు కాలాల్లో అండగా నిలిచేది. రైతాంగానికి 40 శాతం రాయితీతో పప్పుశనగ విత్తనాలను అందించి, రబీ సాగులో రైతులకు విత్తన సమస్య లేకుండా తోడ్పాటు అందించింది.

– శ్రీనివాసులు, అగ్రీ అడ్వైజరీ బోర్డు మాజీ అధ్యక్షుడు, బెళుగుప్ప మండలం

ప్రతి రైతుకూ 25 శాతం సబ్సిడీతో పంపిణీ



ప్రస్తుతం నల్లరేగడి భూముల్లో విత్తనసాగు చేపట్టే రైతులకు పప్పుశనగ విత్తనాలను నేటికీ 25 శాతం సబ్సిడీతో పంపిణీని కొనసాగిస్తున్నాం. ప్రభుత్వ నిబంధనల మేరకు రాయితీతో జేజే 11 రకం పప్పుశనగ విత్తనాలను అవసరం ఉన్న ప్రతి రైతుకూ ఆర్‌ఎస్‌కేల ద్వారా వారి గ్రామాల్లోనే పంపిణీ చేస్తున్నాం.

– పద్మజ, ఏడీఏ, ఉరవకొండ డివిజన్

ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలి



ఆర్‌డీఓ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి హనుమంతురాయుడు, కుల్లాయిస్వామి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జూనియర్ కాలేజీలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని విద్యార్థులతో కలిసి ఆర్‌డీఓ వసంత్‌బాబుకు వినతి పత్రం అందజేసి, ధర్నా చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కాలేజీలల్లో వెంటనే మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. విద్యార్థుల భవిష్యత్ కోసం ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలపై త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గళం విప్పాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, జిల్లా కోశాధికారి నరసింహ యాదవ్, మంజునాథ్, జిల్లా సహాయ కార్యదర్శులు వెంకట్ నాయక్, చందు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజేష్ పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతే 'ఉల్లాస్' లక్ష్యం



సదస్సులో మాట్లాడుతున్న వయోజన విద్య సూపర్‌వైజర్ పరమేశ్వరప్ప

బొమ్మనహాళ్: పొదుపు గ్రూప్ సభ్యుల సంపూర్ణ అక్షరాస్యతే ఉల్లాస్ కార్యక్రమ లక్ష్యమని వయోజన విద్య సూపర్‌వైజర్ పరమేశ్వరప్ప, ఏపీఎం రామకృష్ణ అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా పొదుపు గ్రూపుల్లోని నిరక్షరాస్యులకు చదువు చెప్పెందుకు ఏర్పాటైన వలంటీర్లకు శిక్షణ నిర్వహించారు. వారు మాట్లాడుతూ పొదుపు గ్రూపుల్లో 1,865 మంది నిరక్షరాస్యులను సర్వే ద్వారా గుర్తించి, వారికి చదువు చెప్పేందుకు ప్రతి 10 మందికి ఒక వలంటీర్‌ను ఎంపిక చేసి మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శాంతకుమారి, అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్లు, సీసీలు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న పట్టణ సీఐ వెంకటరమణ

కళ్యాణదుర్గం రూరల్: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పట్టణ సీఐ వెంకటరమణ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో నిర్వహించిన మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు ఉన్నమైన చదువులు చదివి జీవితంలో ఉన్నతమైన స్థాయికి ఎదగాలన్నారు. చదువుకోవాల్సిన వయస్సులో మత్తు పదార్థలకు భానిసై జీవితాలు అందకారంలోకి నేట్టుకోకండి అని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

గుమ్మఘట్ట: నిరక్ష్యరాస్యులను అక్షరాస్యులుగా మార్చాలని ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. మండల కేంద్రంలో శ్రీలక్ష్మీ మహిళా మండలి సమైఖ్య కేంద్రంలో ఉల్లాస్ కార్యక్రమంపై వలంటీర్లకు, వీఓఏలు, క్లస్టర్ కోఆర్డినేటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెలుగు ఏసీ గోవిందప్ప, సీడీపీఓ పద్మావతి, ఇన్‌చార్జ్ ఏపీఎం అనూక్, వలంటీర్లు, వీఓఏలు , క్లస్టర్ కోఆర్డినేటర్ల తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం



ఉద్దేహాళ్‌లో కేన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బొమ్మనహాళ్: కేన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బొమ్మనహాళ్, శ్రీధరఘట్ట పీహెచ్‌సీల వైద్యాధికారులు శ్రీలక్ష్మీ, గీతా భార్గవి సూచించారు. గురువారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా ఉద్దేహాళ్, శ్రీధరఘట్ట, కొలగానహళ్లి గ్రామాల్లో కేన్సర్‌పై అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు.

కేన్సర్‌ను తరిమికొడదాం

గుమ్మఘట్ట: మహమ్మారి కేన్సర్ వ్యాధిని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీహెచ్‌సీ వైద్యులు సందేశ్‌కుమార్,బాలాజీ నాయక్ పేర్కొన్నారు. నేషనల్ కేన్సర్ డే సందర్భంగా మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మురళీధర్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీకి రాజకీయ గ్రహణం



అధికారులు సీజ్ చేసిన మధు టాకీస్ వద్ద గల 18వ నంబర్ చౌక దుకాణం

రాయదుర్గంటౌన్: పేదల బియ్యం పంపిణీకి రాజకీయ గ్రహణం పట్టింది. పట్టణంలోని 16,17 వార్డుల పరిధిలోని మధు టాకీస్ వద్ద నున్న 18వ నంబర్ స్టోరును అధికారులు ఈ నెల 4న సీజ్ చేశారు. అప్పటి నుంచి కార్డుదారులకు సరుకులు అందక, ఇబ్బందులు పడుతున్నారు. సదరు స్టోరు డీలర్ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు అని, ఎట్టిపరిస్థితుల్లోనూ తమకే దక్కాలనే టీడీపీ నేతల ఒత్తిడితో అనేక మార్లు తనిఖీలు చేసి, లొసుగులు వెలికితీసేందుకు ప్రయత్నించారు. ఇటీవల తనిఖీ చేసి సరుకుల్లో వ్యత్యాసం ఉండడంతో స్టోర్ సీజ్ చేశామని సీఎస్‌డీటీ సుదర్శనాచారి స్టోరు బాధ్యతలను ఇతరులకు కేటాయించి సరుకులు పంపిణీ చేయిస్తామని చెప్పారు. స్టోరు పరిధిలో దాదాపు 800 మంది కార్డుదారులుండగా 200 మందికి సరుకులు పంపిణీ చేశారు. ఇంకా 600 మంది లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేయాల్సి ఉండగా వ్యత్యాసం ఎలా వస్తుందని డీలరు ఆవేదన వ్యక్తం చేశాడు. పట్టణంలో ఏ ఒక్క స్టోరు నుంచి ఎండీయూ వాహనాలకు సరుకులు ఇవ్వడం లేదన్నాడు. పట్టణంలోని మొత్తం 23 చౌకధాన్యపు డిపోలు ఉన్నాయి. ఇప్పటికే రాజకీయ ఒత్తిడితో దాదాపు 11 షాపు డీలర్లను తొలగించి టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కట్టబెట్టారు. ఇంకా నలుగురు డీలర్లతో రాజీనామాలు చేయించి, తమకే ఇవ్వాలని అధికారులపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల 18వ స్టోరు డీలరుపై వేటు చేసి సీజ్ చేశారు. స్వచ్ఛందంగా తప్పుకోకపోతే అధికారులతో తనిఖీ చేయించి సీజ్ చేయిస్తామని బెదిరిస్తున్నట్లు సమాచారం.

సంక్షిప్త సమాచారం

వివరాలు నమోదు చేసుకోండి

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం మున్సిపాలిటీలోని మెప్మా పరిధిలో ఉన్న ఎస్‌హెచ్‌జీ స్వయం సహాయక సంఘం సభ్యులు తమ సంఘం వివరాలను ప్రొఫైలింగ్ యాప్‌లో నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ వంశీకృష్ణ భార్గవ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. యాప్ ద్వారా సంఘాల సభ్యుల పొదుపు, అప్పులు, సాంఘిక, ఆర్థిక వాస్తవిక సమగ్ర సమాచారాన్ని పొందుపరచాలన్నారు. ఈ నెల 8 నుంచి 20 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

మున్సిపల్ కార్మికులకు మెటీరియల్ పంపిణీ

రాయదుర్గంటౌన్: పురపాలక సంఘంలో పనిచేస్తున్న రెగ్యులర్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులకు రక్షణ మెటీరియల్‌ను గురువారం పంపిణీ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కౌన్సిలర్లు హాజరై దాదాపు 47 మంది కార్మికులకు దుస్తులు, టవళ్లు, నూనె, సబ్బులు, గ్లౌజులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు శారదాదేవి, పద్మజ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పంపిణీ

బొమ్మనహాళ్: మండలంలోని కొలగానహళ్లి గ్రామంలో రేషన్ సరుకులు పంపిణీ చేసిన్నట్లు తహసీల్దార్ మునివేలు తెలిపారు. 'రేషన్ బియ్యం పంపిణీ ఎప్పుడో..?' శీర్షికన 'సాక్షి'లో గురువారం వార్త ప్రచురితమైంది. దీంతో స్పందించిన తహసీల్దార్ మునివేలు.. ఆరోతేదీ నాటికి ప్రచురణ కావడంతో స్పందించిన తహసీల్దార్ మునివేలు.. ఆరో తేదీ దాటినా ఎందుకు పంపిణీ చేయలేదు.. వెంటనే రేషన్ పంపిణీ చేయాలని స్టోర్ డీలర్‌కు, ఎండీఎం ఆపరేటర్‌ను ఆదేశించారు. గ్రామంలో 463 రేషన్‌కార్డులకు 67.67 క్వింటాళ్ల బియ్యం, 4.45 క్వింటాళ్ల పంచదార పంపిణీ చేసినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బ్రహ్మసముద్రం : శ్రీకాకుళం జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–17 అథ్లెటిక్స్ పోటీలో 4 గీ400 రిలే విభాగం పరుగు పందెంలో బ్రహ్మసముద్రం జెడ్పీ హెచ్ఎస్ పదోతరగతి విద్యార్థిని శివలింగమ్మ ప్రతిభ కనబరిచింది. శివలింగమ్మను హెచ్ఎం చంద్రమౌళి, పీఈటీ ఇబ్రహీం, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వజ్రకరూరు: స్థానిక స్త్రీశక్తిభవనంలో ఈ నెల 8న శుక్రవారం మండల సర్వసభ్యసమావేశం నిర్వహించనునానరు. ఈ మేరకు ఎంపీపీ రమావత్‌దేవి, ఎంపీడీఓ రవిప్రసాద్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. సమావేశానికి ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

కార్తీక దీపోత్సవం

బొమ్మనహాళ్: కార్తీక మాసం దీపోత్సవం సందర్భంగా గోవిందవాడ గ్రామంలో వెలసిన శ్రీ యన్నే రంగనాథేశ్వరస్వామి (యన్నప్ప తాత) ఆలయంలో గురువారం విశేష పూజలు జరిగాయి. తెల్లవారుజామున, సాయంత్రం సంధ్యా సమయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాన్ని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు.

పోస్టర్ల విడుదల

శెట్టూరు: ఎస్సీ వర్గీకరణ విషయమై చలో విజయవాడ కార్యక్రమం విజయవంతం చేయాలని ఎమార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గురుమూర్తి పిలుపునిచ్చారు. గురువారం పోస్టర్లు విడుదల చేశారు. ఈవిషయంపై ఈ నెల 16న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టామన్నారు. నాయకులు తిప్పేస్వామి, మారెన్న, బాబు, గంపల రామంజి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

శెట్టూరు: మండలంలోని ములకలేడుకు చెందిన ఉపాధ్యాయుడు నరసింహులు (38) అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. రంగయ్యపాళ్యం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. నెల రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌తో బెంగళూరు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. స్థానిక సర్పంచ్ నాగరాజు, ఎంపీఓ శ్రీధర్, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళి అర్పించారు.

కనుల పండువగా పల్లకీ ఉత్సవం

వజ్రకరూరు: స్థానిక షిర్డీ సాయి ఆలయంలో గురువారం సాయంత్రం పల్లకీ ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, తీర్థప్రసాద వినియోగం ,అర్చనలు, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, హారతులు తదితర కార్య క్ర మాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకీ ఉత్సవం వైభవంగా నిర్వహించారు.

'సికిల్ సెల్' అనీమియా నిర్ధారణ పరీక్షలు

కూడేరు: నలభై ఏళ్లలోపు మహిళల్లో వచ్చే 'సికిల్ సెల్' అనీమియా వ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహించాలని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి వైద్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం కూడేరులోని ఎస్టీ కాలనీలో గిరిజన మహిళలకు సికిల్ సెల్ అనీమియా నిర్ధారణ పరీక్షలను వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈ పరీక్షలను ఎంపీడీఓ కుళ్లాయి స్వామి తనిఖీ చేశారు. కిట్ పద్ధతి ద్వారా సికిల్ సెల్ అనీమియా పరీక్షను నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ యశోద, ఎంపీడీఓ గిరిజన మహిళలకు సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ కరిష్మా, ఏఎన్ఎం చంద్రకళ, ఆశా వర్కర్లు సుమలత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహబూబ్‌సుబానీ గ్యార్మీ వేడుక

రాయదుర్గంటౌన్: పట్టణంలో మహబూబ్ సుబానీ గ్యార్మీ వేడుక అరేకటిక సంఘం ఆధ్వర్యంలో గురువారం జరిగింది. గ్యార్మీ పండగను పురస్కరించుకుని సాయంత్రం పట్టణంలోని మటన్ మార్కెట్‌లోని మహబూబ్‌సుబానీ జెండా కట్ట వద్ద నుంచి జెండా గంధ మహోత్సవాన్ని పట్టణ బళ్లారి రోడ్డు, ఆత్మకూరు వీధి, వినాయక సర్కిల్, ఓబుళాచారి రోడ్డు మీదుగా తిరిగి జెండా కట్ట వద్దకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అరేకటిక సంఘం ప్రతినిధులు, సమాజ సభ్యులు పాల్గొన్నారు.

సార్..తాగునీటి సమస్య పరిష్కరించండి



సమస్యలను కలెక్టర్‌కు వివరిస్తున్న సర్పంచ్ లలితమ్మ

కూడేరు: కూడేరులో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, సమస్య పరిష్కరించాలని సర్పంచ్ లలితమ్మ జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్‌ను కోరారు. గురువారం కలెక్టర్ కూడేరులోని పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె కలెక్టర్‌ను కలిశారు. గ్రామంలో జనాభా పెరిగిపోతోంది. పంచాయతీ తరపున ఏర్పాటు చేసిన బోర్లలో నీటి లభ్యత తగ్గింది..ఓవర్ హెడ్ ట్యాంక్‌కు నింపుతున్నా నీరు ప్రజలకు సరిపోవడం లేదన్నారు. అదనంగా ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించి, బోర్లు వేయించి నీటిని సరఫరా చేసి ప్రజలకు తాగునీటి సమస్య తీర్చాలని ఆమె కోరారు.

రక్తహీనత రాకుండా చర్యలు



విద్యార్థినులకు అనీమియా పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

ఉరవకొండ: స్థానిక గిరిజన గురుకుల బాలికల పాఠశాలల్లో విద్యార్థినులకు ఎంపీడీఓ రవిచంద్ర, ఉరవకొండ వైద్యాధికారిణి డాక్టర్ సాహితి, మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో అనీమియా పరీక్షలు చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ బాలికల్లో రక్తహీనత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థినులు సరైన పోషకాహారం తీసుకోక అనారోగ్యంబారిన పడతారన్నారు. ఆకు కూరలు, గుడ్డు, కూరగాయాలతో కూడిన భోజనం అందించాలన్నారు. వైద్యాధికారిణి డాక్టర్ సాహితి మాట్లాడుతూ 9, 10 తరగతుల విద్యార్థినులు రక్తహీనత బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

లైబ్రరీకి పుస్తకాల వితరణ

వజ్రకరూరు: కొనకొండ్ల గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల (రెసిడెన్షియల్) పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి రామకృష్ణ రూ.20వేల విలువజేసే పుస్తకాలను గురువారం అందించారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు జిల్లాలోని ప్రతి పాఠశాలలో పూర్వ విద్యార్థులతో వ్యాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహాత్మా జ్యోతిబా పూలే రెసి డెన్షియల్ పాఠశాలల కన్వీనర్ సంగీతకుమారి, అలుమ్ని జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి, కొనకొండ్ల లైబ్రేరియన్ రామాంజనేయులు పాల్గొన్నారు.

13 నుంచి ఉచిత శిక్షణ

కూడేరు: అనంతపురం రూడ్‌సెట్ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి కంప్యూటర్ టాలీ, జర్దోసి మగ్గం వర్క్‌పై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి గురువారం తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన రేషన్ కార్డు, ఆధార్ కార్డుఉన్న వారు శిక్షణకు అర్హులన్నారు. శిక్షణ 30 రోజులు ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో భోజనం, వసతిని కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 9618876060 , 8309915577లో సంప్రదించాలన్నారు.